గలగలమని ప్రవహించే బ్రహ్మపుత్రా నది నుంచి తవ్విన ఒక కాలువ ఒడ్డున చిన్న కుటీరంలో మట్టి అరుగుమీద కూర్చుని అడుగుల సవ్వడి కోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని వుంది ఓ ముసలామె.

మరి కొంచెం సేపట్లో పావుకోళ్ళ శబ్దం, మామూలు అడుగుల సవ్వడి రెండూ ఆమె చెవులకు సోకాయి.



శ్రీమతి జొన్నలగడ్డ లలితాదేవి

"'క్షేమా!" అంటూ ఆప్యాయంగా పిలిచింది.

"'నేనేనమ్మా! ఏమిటిక్కడ కూర్చున్నావు?" అని అడిగింది క్షేమ.

"'ఏముందమ్మా! నీ కోసమే!" అందా గుడ్డితల్లి కూతురి చేయి అందుకుని.

"'వస్తున్నానుగామ్మా! ఆకలవుతోందా? పద, ఇదుగో ప్రసాదం" అంటూ చేతిలోని ఆకు పొట్లం ఆమెకి అందించింది.

అంతవరకూ చూడటమే తప్ప పలకని మహానంద్ "నేను వెళ్ళిరానా క్షేమా?" అని అడిగాడు.

వెళ్ళమన్నట్లు తల వూపింది క్షేమ.

ఆమె వంక ఒకసారిచూసి వడివడిగా అడుగులు వేస్తూ క్షణంలో కనుమరుగయ్యాడు మహానందుడు.

మహానందుడు వెళ్ళినవైపే చూస్తుండి పోయింది క్షేమ.

'గోంపా' బౌద్ధ విహారంలో క్షేమ ఒక బౌద్ధభిక్షుకి. మహానందుడు అందులోనే బౌద్ధభిక్షువు. 'గోంపా' బౌద్ధ విహారం తవాంగ్ పట్టణంలో వుంది.

అరుణాచలప్రదేశ్‌కి వాయవ్యకొసన కామెంగో జిలాలో పద్నాలుగువేల అడుగుల ఎత్తున సెలా కనుమగుండా వెళ్ళాలి తవాంగ్‌కి.

తేజపూర్‌నుంచి కొండల మధ్య వున్న రోడ్డుగుండా వెళ్ళాలి అతను.

"ఇప్పటికే చాలా పొద్దుపోయింది. అతను వెళ్ళేసరికి చాలా చీకటి పడి పోతుంది. అయినా ఈ రోజింత ఆలస్యం అయిందేం?" అని బాధపడింది క్షేమ.

అలా పొద్దుపోవడానికి కారణం తామిద్దరూ మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ రావడమేనని మాత్రం ఆమె గ్రహించలేదు.

క్షేమ చేసే పనల్లా ఆ బౌద్ధ విహారాన్ని నిత్యం పరిశుభ్రంగా వుంచడం.

అక్కడి లామాల కాషాయాంబరాలు ఉతికి ఆరవేయడం. కాషాయాంబరాలు ధరించినా, సౌందర్య దేవతలా మెరిసిపోతూ వుండే ఆమెకి తోడుగా ఆ బౌద్ధ విహారంనించి ఆమె ఇంటిదాకా వచ్చి దింపి వెడతాడు మహానంద్.

ఉదయం నించి, సాయంత్రం వరకూ పని చేస్తూనే వుంటుంది క్షేమ.

అలా పని చేసి ప్రసాదం తెచ్చి గుడ్డి తల్లికి పెడుతూ వుంటుంది.

"'నువ్వు తిన్నావామ్మా!" అని అడిగింది తల్లి.

"తిన్నానులేమ్మా! అది నీకే" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఆ కుటీరం చుట్టూ వేరే గోడలేమీ లేవు. క్షేమ పెంచే మొక్కలు తప్ప. పక్కన నిశ్చలంగా ప్రవహించే కాలువ. ఆ కాలువ నీళ్ళే తెచ్చి ఇంట్లో పోస్తుంది. మట్టి కుండలు- ఇత్తడి గాసులు- మట్టిమూకుళ్లు ఇవే ఆ కుటీరంలోని ఆస్తిపాస్తులు. ఇల్లు, వాకిలి ఎప్పుడూ ముగ్గులతో కళకళలాడుతూనే వుంటాయి.

క్షేమ కళ్ళు మూసుకుని పడుకోగానే మహానంద్ గుర్తు వచ్చాడు.

పాపం! ఏరోజూ తనని దింపడానికి విసుక్కోడు. నవ్వుతూ నిదానంగా, సౌమ్యంగా మాట్లాడే అతనంటే ఆ బౌద్ధ విహారంలో అందరికీ ఇష్టమే. కోపం అనేది ఇతనికి లేదేమో! అనిపిస్తుంది- అనుకొంది మురిపెంగా.

తెల్లవార్తూండగానే తన కాలకృత్యాలు తీర్చుకుని, కాలువలో స్నానం చేసి కాషాయ వస్త్రాలు ధరించి వెళ్ళిపోతుంది క్షేమ. అది ఆమె దినచర్య.

ఆరోజు ఆమెకంటే ముందే వచ్చి వేశాడు మహానంద్.

విశాలమైన నుదురు- కాంతిని వర్షించే అతని కళ్ళు- పచ్చని దేహచ్ఛాయ గల అతనంటే తగని అభిమానం క్షేమకి.

అలాగే అత్యంత సుందరంగా కాంతి సౌజన్యాలు మూర్తీభవించిన క్షేమ అంటే అతనికీ తగని ఇష్టం.

"ఏమిటి అప్పుడే వచ్చారు?" అని అడిగింది నవ్వుతూ.


"ఏమీ లేదు. నిన్ను చూద్దామని."

"నన్ను రోజూ చూడటంలేదా? నాలో ప్రత్యేకత ఏముందని



# క్షమ

ఓన్నలగడ్డ లలితాదేవి



'అది చూసేవారికి తెలుస్తుంది." అని జవాబిచ్చాడు మహానందుడు.

అక్కడ తనపనిలో నిమగ్నమయింది క్షమ. మహానంద్ ప్రసాదం సేకరించడానికి వెళ్ళిపోయాడు.

అక్కడ దాదాపు నూటయాభై మందిపైనే వున్నారు బౌద్ధ భిక్షువులు. కొందరిని కలిపి ఒక చిన్న సంఘంగా ఏర్పరచి ఒక్కొక్క సంఘానికి ఒక్కొక్క పని నిర్దేశించారు.

క్షమ ఆ సాయంత్రం ఇంటికి వెడుతుంటే మామూలుగానే సాయం వచ్చాడు మహానందుడు.

"క్షేమా! కాసేపీ నిర్మల ప్రదేశంలో కూర్చుందాం రారాదూ!" అని అడిగాడు చిన్నతోటలా వున్న ప్రాంతాన్ని వేలితో చూపిస్తూ.

"పదండి. నాకు కూడా ఇప్పుడు పనేమీ లేదు." అంటూ అతను చెప్పిన తోటవైపు దారి తీసింది. ఇద్దరూ అక్కడ పెద్ద చెట్టు క్రింద తిన్నెపై కూర్చున్నారు.

"క్షేమా! మనిషి ఎందుకు సన్యసిస్తాడంటావు?" అని అడిగాడు హఠాత్తుగా.

"తన మనస్సుకు విరక్తి కలిగే సంఘటనలు జరిగినప్పుడు, లేదా తన అంటూ ఆప్యాయతగా చూసుకునే వ్యక్తులు కరువైనప్పుడు మనస్సు సన్యసించాలని కోరుకోవచ్చు." అతని వంక ఒకసారి చూసి తల దించుకుంటూ జవాబిచ్చింది.

"నిజం క్షేమా! చిన్నదానివైనా చాలా సూటిగా సమాధానం చెప్పావు" అని ఆగి "నిన్ను ఒక విషయం అడగాలనుకొంటున్నాను ఏమీ అనుకోవుగదా!"

"అడగండి" అంది నవ్వు ముఖంతో.

ఆ నవ్వు చూసేసరికి అతనికి చాలా ధైర్యం వచ్చినట్లుంది. అందుకే.

"క్షేమా' నువ్వు చాలా చాలా అందమైన దానివి. మరి పెళ్ళాడి సుఖపడక ఈ తపస్విని వేషం ఎందుకు ఎన్నుకున్నావు?" అని అడిగాడు కుతూహలంగా.

ఆ మాటకి మేఘాచ్ఛాదిత చంద్రబింబంలా అయింది క్షేమ ముఖం.

"దానికి నేను పైన చెప్పిన జవాబునే మననం చేసుకోండి మహానందా!" అంది విషణ్ణ వదనంతో.

"అంటే మొదటి వాక్యమా, రెండో వాక్యమా! ఏది నీ జీవితానికి అన్వయిస్తుంది?"

"ఒకవిధంగా చెప్పాలంటే రెండూనూ" అని ఆగి "ఏం? ఈ రోజు నాచరిత్రమీదకి పోతోంది మీ మనస్సు?" అని అడిగింది.

"ఏమీలేదు క్షేమా! నువ్వు చిన్నదానివి. వయసులోవున్న అందమైనదానివి. ఒక యింటిదానివై పిల్లాపాపలతో సుఖపడక, ఇలా బౌద్ధవిహారాల్లో లామాలందరికీ సేవ చేస్తూ- ఈ ప్రసాదాలతో పొట్టనింపుకుంటూ కష్టపడుతున్నావుగదాని" సానుభూతిగా అడిగాడు.

"నేను ఒకప్పుడు యింటి దానినైన దాన్నే! కానీ విధి వికటించి ఇలా భిక్షుకిగా మారిపోయాను. నా అంద చందాల మాట ఏమోగాని, నన్ను పెళ్ళాడతానంటూవచ్చిన యువకుడి చేత మనస్ఫూర్తిగానే తాళికట్టించుకున్నాను- కాని అదృష్టవంతులు కలసి వుంటారు. దురదృష్టవంతులు విడిపోతూ వుంటారు. నా భర్త మొదట్లో బాగానే వుండేవాడు. చిన్న ఉద్యోగం చేస్తుండేవాడు. వచ్చిన దాంతో గుట్టుగా సంసారం ఈదుస్తుంటే- అతగాడికి ఏం పిదప కాలం వచ్చిందో ఏమో- ఆఫీసు డబ్బు పట్టుకుని పారిపోయాడు. దొంగతనం చేసినా-అందరూ పట్టుబడకుండా తిరగలేరు. దానికి కూడా చాకచక్యం వుండలి. అసలే అంతంతమాత్రపు ధైర్యం. తెలివిగల అతనెందుకా డబ్బు వాడుకున్నాడో నాకీ క్షణం వరకూ అర్థం కాలేదు. ఏదో శని ఆ క్షణాన అతని నెత్తినుండి. ఆ పని చేయించింది. ఆ డబ్బుతో సహా అతను పట్టుబడ్డాడు. జైలుకి పోయాడు.

జైలు నుంచి విడుదలయ్యాక "ఈ అవమానం భరించలేను- నేను చస్తున్నాను నాకోసం వెతకద్దు." అంటూ ఒక చీటీ రాసి నాపక్కనే పెట్టి రాత్రికి రాత్రి

## పోలికలు

అనంత నీలాకాశంలో
తళుక్కుమంటూ అందని తారకలు.
ఈ అగమ్య జీవితయానంలో
చురుక్కుమంటూ తీరని కోరికలు.

—మెడికో ప్రభు

మాయమయ్యాడు. చచ్చాడో, బతికాడో చూసినవాళ్ళెవరూ లేరు అతన్ని. ఇంక నా మనస్సుకు విరక్తి కలిగి ఈ బౌద్ధ భిక్షుకినయ్యాను." అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

అది విని దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు మహానంద్. మనిషి తెలిసిచేసే తెలివి తక్కువ పనులుకొన్ని-తెలియకచేసేతప్పులు కొన్ని. తప్పులనేవి ఎలా జరిగినా, వాటి ప్రభావం మటుకు జీవితంమీద విస్తారంగా వుంటుంది.

కాసేపాగి "మహానందా? మీరెందుకు ఈ విధంగా లామాలయ్యారూ? మీ రూపం-మీ తీవీ చూస్తుంటే మీరేదో పెద్దకుటుంబానికి చెందినవారని నా మనస్సు చెబుతూ వుంటుంది. నిజం చెప్పరూ? మీకు అభ్యంతరం లేకపోతే!" అని అడిగింది క్షేమ.

"నీ విషయం నేను అడిగినప్పుడు నా విషయంకూడా నువ్వు అడక్కపోవని ఇందాకే అనుకున్నాలే" అంటూ చిన్నగ నవ్వి "క్షేమా! ఇంచుమించు నీ కథలాంటిదే నా కథకూడా. నేను ఫిలాసఫీ ప్రొఫెసర్ని. మొదట్నుంచీ నాకీ వేదాంతమంటే తగని ప్రేమ. నేనూ పెళ్ళిచేసుకున్నాను. కాని నా భార్య నా అభిరుచులను అభిప్రాయాలను మన్నించే మనస్తత్వం కలది కాకపోవడంతో మా సంసారం నరకమైంది. ఆమెకి ఆడంబర జీవితం అంటే ఇష్టం.

ఆవిడ కోరికల మేరకు నేనుడబ్బుసంపాదించలేక పోయాను. మనిషికి డబ్బుంటే చాలు. మిగతావి ఏమిలేకపోయినా ఫర్వాలేదనే ఆమె అభిప్రాయాలకి, నా వేదాంతానికి పొత్తు కుదరలేదు. ఫలితంగా ఆమె మరో ధనవంతుడిని, డాంబిక జీవిని ఎన్నుకొంది. నన్ను తిరస్కరించింది. నేను విరక్తి చెంది ఇక్కడికి వచ్చేశాను" అన్నాడు నింపాదిగా.

పాపం అనుకుం : సానుభూతిగా.

"ఇద్దరిజీవిత నౌకలూ భగ్నమయినవే. అందుకే మనం ఇద్దరం ఇంత స్నేహితులమైనాము' అంది క్షేమ.

"బాధంటే తెలిసిన వాళ్ళకే ఎదుటివారి బాధ అర్థం అవుతుంది," అంటూ మహానందుడు చెట్ల ఆకుల మధ్య నుంచిదూసుకు వస్తున్న అస్తంగత భానుని, ఎఱ్ఱని కిరణాలను చూస్తూ వుండిపోయాడు.

"ఇక వెడదామా?" అని అడిగింది క్షేమ.

"వెడదాంలే క్షేమా: మరో పావుగంట కూర్చుందాము. తొందరేముంది?" అన్నాడు సూర్యాస్తమయాన్ని చూస్తూ.


క్షేమ కూడా అదే గమనిస్తూ ఆలోచనలో పడిపోయింది.

"క్షేమా! ఈ ప్రపంచమంతా దుఃఖభాజనమని, దుఃఖానికి హేతువు కోర్కెల సముదాయమని. సముదాయ నిరోధం — నిరోధానికి మార్గం అనే నాలుగు సూత్రాల ప్రాతిపదికగా వెలుగుతున్న బుద్ధుని బోధనామృతం, బౌద్ధమత సారాంశం. మన లాంటి వాళ్ళకి పూర్తిగా అన్వయిస్తుంది కదూ!"

"మతాలు వేరయినా సారాంశం ఒక్కటే - చెప్పే భాషలు వేరయినా భావాలు ఒకటే - అది ఎవరు అర్థం చేసుకునే తీరుతెన్నులను బట్టి వాటి ప్రభావానికి లోనవుతారు. అది, చెప్పే వ్యక్తుల మాటలోని రమ్యత తప్ప వేరేం కాదని నా ఉద్దేశం" అంటూ లేవబోయింది క్షేమ.

ఆమె మాటలకు విస్మయంగా చూశాడు మహానందుడు.

"ఈమె ఏది చెప్పినా అతి సూటిగా, అతి చక్కగా చెప్పేస్తుంది. ఈ బుద్ధి



సూక్ష్మత ఈమెకెలా వచ్చింది!" అని అనుకున్నాడు విడ్డూరంగా.

ఇంక చీకటిపడిపోతోందని యింటికి బయలుదేరారు.

దారిలో కాస్త కాలుజారి పడబోయింది క్షేమ. గభాలున ఆమెని పట్టుకున్నాడు మహానందుడు. సున్నితమైన ఆమె శరీరం తగలగానే అతని హృదయంలో స్పందన కలుగసాగింది.

అతని స్పర్శతో వళ్ళంతా కరెంటు షాకు తగిలినట్లయింది క్షేమకు.

ఒక్క క్షణం అతని బలమైన హస్తాలు ఆమెని గట్టిగా అదుముకుని వదిలాయి.

క్షేమ సిగ్గుతో తల వంచుకుంది.

ఈ జీవితం నీటిబుడగలాంటిది అని అంటారు — అలాంటి అల్ప ఆయుర్దాయంలో తను అనుభవించిన సుఖాలేమున్నాయి? అనుకున్నాడు తనలోని సంచలనాన్ని కప్పిపుచ్చుకుంటూ అందుకే తలలు బోడులయినా తలపులు బోడులు కావని అన్నది.

ఆమెను ఇంటిదాకా దింపి "వెళ్ళిరానా క్షేమా!" అని అడిగాడు.

"వెళ్ళండి" అన్నట్లు తల వూపింది.

ఆ రాత్రి అంతా మహానందుడికీ నిద్ర లేదు క్షేమకీ నిద్రలేదు. సున్నితమైన ఆమె శరీరం అతన్ని వివశుడిని చేస్తోంది. బలమైన అతని చేతులు అతని స్పర్శ ఆమెలో మధురానుభూతులను కలిగిస్తున్నాయి.

సన్యాసం స్వీకరించి బౌద్ధ భిక్షువుగా మారిన తన ఎదలో క్షేమ రూపం ఆదిలోనే చెరగని ముద్ర వేసింది ఇప్పుడు మరీ తనలో వలపు తలపులను రేపుతోంది.

"భగవాన్! నాలో ఎందుకీ వికారాన్ని కలిగిస్తున్నావు? మంచికా? చెడుకా?" అనుకున్నాడు రవ్వంత వణుకుతూ.

ఎనాడో కొద్దిరోజులు సంసారం చేసింది తను భర్తతో. అతని నిష్క్రమణంతో తనకి మనస్సు విరిగి బౌద్ధ భిక్షుకిగా మారిపోయింది. అంతమాత్రాన తన మనస్సు పూర్తిగా పరిపక్వమయి. సన్యాసినిగా మారిపోయినట్టేనా? తనలో ఇంకా కామవాంఛ లున్నాయా! అవి వున్నప్పుడు తనీ సన్యాసిని కావడానికి అర్హత వుందా! పరిపరివిధాల పోతోంది మనస్సు గుర్రంలాగా—పగ్గాలులేని గుర్రంలాగా పరుగులు తీస్తోంది. తనకేకాదు. అతనికీని అని ఆలోచిస్తూ కలత నిద్ర పోయింది క్షేమ.

మనస్సు చలించనంతసేపే- అది పట్టు తప్పిందంటే దాన్ని సృష్టించిన బ్రహ్మదేవుడికికూడా సాధ్యంకాదు పగ్గాలు వేయడం. రాను రానూ ఆ యిద్దరికి సరిగ్గా అలాగే జరిగింది. అణిగివున్న కోరికలు ఇద్దరిలోనూ నాగుపాముల్లా బుసకొట్టాయి. ఆరోజు.

క్షేమ తల్లికి సుస్తీగా వుండటంతో మహానందుడు ఆమెకి సాయంగా ఆ కుటీరంలోనే పడుకున్నాడు క్షేమ తల్లి మత్తుగా పడివుంది. ఆ చిన్న కుటీరంలో ఎంత ఒదిగివున్నా ఒకరి చెయ్యి ఒకరికి తగులుతూనే వుంది. మహానందుడు బయట పడుకోవటానికి వీలులేకుండా బయట వర్షం- ఏ క్షణాన అయినా ఆ కుటీరం పడి పోతే మహానందుని లాంటి మగవాడి తోడులేందే ఆ గుడ్డి తల్లిని బయటకి తీసుకురావడానికి వీలుండదు. తనమీద పడిన క్షేమ చేతిని పట్టుకుని ఆవేశంగా మీదికి లాక్కున్నాడు మహానందుడు అతని విశాల వక్షస్థలంలో బల్లిలా అంటుకుపోయింది క్షేమ.

ఆ ప్రేమ పిపాసులకు ప్రకృతి సాయం చేయడంతో ఆ యిద్దరూ ఏకమైపోయారు. ఆ రోజే కాదు వరసగా ఎప్పుడు పడితే అప్పుడు- "సుందరమైన నీ రూపాన్ని చక్కని కుంచెతో ఎప్పుడో చిత్రిస్తాను చూడు" అన్నాడామెను ఆర్తిగా హత్తుకుంటూ.

"అయితే మీరుగొప్ప చిత్రకారులన్న మాట." అంది విస్ఫారిత నేత్రాలతో. కాలక్షేపానికి అతను వేసిన బొమ్మలు తెచ్చి చూపించాడు ఆమెకి. అతనామె చిత్రాన్ని గీయలేదుగాని. అతని ప్రతిరూపం మటుకు ఆమె కడుపులో రూపుదిద్దుకో సాగింది.

తనకి నెల తప్పిందని తెలిశాక గజగజ వణికిపోయింది క్షేమ.

"మహానందా! తప్పు మీద్దరం కలిసే చేశాం. నీ ప్రతిరూపం నా కడుపులో పెరుగుతోంది. మనం యెక్కడికన్నా వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుందాం" అంది దీనంగా అతని కళ్ళల్లోకి చూస్తూ.

"క్షేమా! జరిగిపోయిందానికి నేనూ బాధపడుతున్నాను. కాని పెళ్ళాడి ఆ అంపటంలో దిగాలన్న వ్యామోహం ఏమి లేదు నాకు. దయచేసి నన్ను సంసార బంధంలో పడవేయకు" అన్నాడు నిష్కర్షగా.

ఆ సమాధానానికి దెబ్బతిన్నట్లు చూసింది క్షేమ. ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. అయినా తమాయించుకుని "మహానందా. కోరికలను పరిత్యజించిన వాడే సంయమీంద్ర పదానికి అర్హుడు. నీలో-నాలో అంత శక్తి లేనేలేదు. సంసారంలో పడితే తప్పేమిటి?"

"తప్పుఅంటే తప్పేగదా క్షేమా! ఇక్కడి లామాగా దీక్ష వహించిన నేను పతీ వ్యామోహంలో పడి- ఈ విధంగా పతనమయ్యానంటే తోటి వారిలో ఎంత చులకన! గురుదేవులు ఏమనుకుంటారు?"

"ఒకరనుకుంటారని- నన్ను అన్యాయం చేస్తావా!" సూటిగా అడిగింది. ఆ ప్రశ్నకి వెంటనే జవాబివ్వలేకపోయాడు మహానందుడు. ఒక్క క్షణం ఆగి "తన తిండి తాను తిన్నా లోకానికి వెడుస్తూ వుండాలంటారు పెద్దలు" అని జవాబిచ్చాడు.

"మంచిదే అలాగే భయపడుతూ వుండు. కాని ఆ తడాన్ని- నమ్ముకొన్నదాన్ని అన్యాయం చేయమని ఏ లోకం చెబుతుందో నేనూ చూస్తాను." అంది రోషంగా.

"క్షేమా! నన్ను అర్ధ్రపాం[illegible] చేయకు" దీనంగా అన్నాడు.

"నాకేం వస్తుంది మహానందా నిన్ను అల్లరిచేస్తే! నీకు ఆలోచించుకోవడానికి మూడు నెలలు గడువిస్తున్నాను. ఈలోగా చెప్పగలవనే నా నమ్మకం" అంటూ విసవిసా వెళ్ళిపోయింది.

మూడు నెలల గడువు పూర్తి అయినా మహానందుడు ఏమీ తేల్చుకోలేకపోయాడు ఏ నిర్ణయానికి రాలేకపోయాడు.

క్షేమకు అయిదు నెలలు నిండిపోయాయి. మహానందుడు తన నిర్ణయం మటుకు చెప్పలేదు.

ఏడ్చీ ఏడ్చీ కళ్ళల్లో నీళ్ళు కూడా ఇంకిపోయాయి. నెలలు గడుస్తున్నకొద్దీ తను తల్లి కాబోతున్న విషయం ఎలాగూ దాచడం పడదు. ఆ నిందోక్తులు, అవమానాలు భరించే శక్తి తనకు లేదు- తనలాంటి నిర్భాగ్యురాళ్ళ కోసమే భగవంతుడు మహానందులను ఏర్పాటుచేశాడు. అనుకుంటూ ఒకనాటి వేకువన తమ కుటీరం ముందు ప్రవహించే చల్లని నీటిలో ధడాలున దూకేసింది క్షేమ.

మహానందుడి మనస్సులో సాగర మథనం జరుగుతూంది. ఒకప్రక్క బౌద్ధ విహారాలు, లామాలు కనిపిస్తున్నారు. మరోప్రక్క "నన్ను అన్యాయం చేశావా?" అంటూ దీనవదనంతో క్షేమ కనిపిస్తోంది.

మమతకి, మనుగడకు మధ్య రేగిన సంఘర్షణలో చివరకి మమకారమే గెలిచింది. లోకం ఏమనుకొన్నా సరే; తనని వెలివేసినా సరే క్షేమకి న్యాయం జరగాలి- అన్న నిర్ణయానికి వచ్చి తనలోని పిరికితనానికి స్వస్తిచెప్పి, ధైర్యంగా క్షేమను స్వీకరించాలి అని అనుకుంటూ వచ్చిన అతని కళ్ళకు దర్శన మిచ్చింది క్షేమ మృత కళేబరం.

'క్షేమా' అంటూ గావుకేక పెట్టాడు ఆమె యెత్తుగా కనిపిస్తున్న కడుపును, ఏడుస్తున్న మహానందుడిని చూసి కథ తెలిగ్గానే వూహించారు చుట్టూ చేరినవారు.

విషణ్ణ హృదయంతో తిరిగివచ్చిన మహానందునికి గురుమహరాజ్ పిలుస్తున్నారన్న కబురు వచ్చింది. కళ్ళు తుడుచుకుని వెళ్ళాడు.

"మహానందా! నువ్వు గొప్ప చిత్రకారుడివట. రేపు బుద్ధజయంతి నాటికి కొత్త మందిరానికి ప్రారంభోత్సవం జరుగుతుంది. నీ చిత్ర కౌశలాన్ని వినియోగించి- బుద్ధభగవానునికి నీరాజన మిచ్చే చిత్రాన్ని తయారుచేయవూ?" అని అడిగాడు గురు మహరాజ్.

చేస్తానన్నట్టు తల వూపి వచ్చాడు. బుద్ధజయంతి ఎన్నో రోజులు లేదు. పని

## వళ్ళంతా కన్నీరే!

గగనం వదనంపై అలుముకున్న
నల్లటి తెరల్ని చీల్చేయాలని
రాత్రంతా ఎగిసెగిసి పడ్డ ఆవేశంపై
గుప్పెడు వెలుగునీళ్ళు చల్లి
నవ్వుతుంది ఉదయం హృదయ
విదారకంగా!

తీరం జైలు హద్దుల్ని
అధిగమిద్దామని
భారంగా నాలుగడుగులేస్తే, పాపం!
వెనుకనున్న శూన్యం వేస్తుంది
గావుకేక!
అణువణువులో అవమానం సుళ్ళు
తిరిగి
శిలలకేసి అలల తలలు బాదుకుని

వళ్ళంతా కన్నీరైనపుడు
హోరుమనే గాలి నిట్టూర్పులా
నిన్నోదార్చేవి?
ఇంత విశాలమైన దానా!
ఎంత విషాదమైన దానవే?!

—బి. శాంతారామ్

ఆనాడే ప్రారంభించాడు. తనలోని ప్రతిభనంతా వినియోగిస్తూ- తిండీ, తిప్పలు కాదు ఆఖరికి నిద్రతోసహా వదిలి నిర్విరామంగా చిత్రాన్ని గీయడం ప్రారంభించాడు.

అతని గుండె ఆవేదనా జ్వాలల మధ్య దహించుకుపోతోంది. శరీరం తగిన పోషణలేక శుష్కించిపోతోంది. అయినా అతను చెక్కుచెదరలేదు. గరళాన్ని మ్రింగిన పరమేశ్వరునిలా తపస్సు ప్రారంభించాడు.

కరుణరసాన్ని వెదజల్లే బుద్ధ భగవానునికి, అందంలో అప్సరసను మించిన లతాంగి, అపార భక్తిశ్రద్ధలతో నీరాజనం సమర్పిస్తోంది.

అపర రతీదేవిని పోలే ఆ చిత్రంలోని మహాద్భుత సౌందర్యవతి ఎవరు? అతని హృదయంలో ఆరని మంటలు మిగిల్చి క్షేమంగా స్వర్గద్వారాలకు చేరిన క్షేమ!

ఆనాడే బుద్ధ జయంతి. భవనం ప్రారంభోత్సవం- బుద్ధుని చిత్ర ప్రతిష్ఠకూడా ఆ రోజే. చిక్కి శల్యమై నడిచేందుకుకూడా ఓపికలేక తను గీసిన చిత్రాన్ని గుండెలకు హత్తుకుని, ఇద్దరు లామాలు అతన్ని నడిపించుకు రాగా ఆ భవనంలోకి అడుగుపెట్టాడు మహానందుడు.

"చిత్రకారులకు ఘన స్వాగతం" అంటూ హృదయపూర్వకంగా ఆహ్వానించాడు గురు మహరాజ్.

తన చేతిలోని చిత్రపటాన్ని గురు మహరాజ్ చేతిలోపెట్టాడు మహానందుడు పైగుడ్డ తొలగించి ఆ చిత్రాన్నిచూసి తన్మయుడయ్యాడు గురు మహరాజ్.

"శభాష్, మహానందా. నీలాంటి అభినవ విశ్వకర్మ రాకతో మా మందిరం పావనమైంది. ఇంతటి అపురూప చిత్రాన్ని నే నింతకు మునుపెన్నడూ చూసి వుండలేదు. ఇదుగో ఈ చిత్రాన్ని నీవే స్వయంగా అక్కడ అలంకరించు. ఆహూతులంతా చూసి తరిస్తారు." అన్నాడు పరమానందంగా.

మహానందుడా చిత్రాన్ని గురు మహరాజ్ చూపించిన స్థానంలో నిలబెట్టాడు. అందరూ ఆ చిత్తరువును చూసి చిత్తరువులే అయ్యారు.

అపార తేజస్సుతో తన నీలి కన్నులలో చూపరులపై చల్లని కరుణా కటాక్షాలను, పెదవులపై మందహాస చంద్రికలనూ వెదజల్లుతున్న గౌతమునికి, జగజ్జేగీయమాన సౌందర్యంతో, వినమ్రంగా నీరాజనం సమర్పిస్తున్న అందాల సుందరి చక్కదనానికి ముగ్ధులై అలాగే చూస్తుండిపోయారు. ఆ యువతి క్షేమేనని ఆ పోలికలే చెబుతున్నాయి అందరికీ. బౌద్ధభిక్షుకులంతా తథాగతుని ముక్తకంఠాలతో స్తుతించడం ప్రారంభించారు. "అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ— మృత్యోర్మా అమృతం గమయ. బుద్ధం శరణం గచ్ఛామి. సంఘం శరణం గచ్ఛామి. ధర్మం శరణం గచ్ఛామి" అంటూంటే వణికే చేతులతో ఆ చిత్రాన్ని తనివితీరా స్పృశిస్తూ, క్రిందకు వాలిపోయాడు మహానందుడు. అతని చేతి వ్రేళ్ళు బొమ్మలోని క్షేమాదేవి నీరాజనం మీదే ఆగిపోయాయి.

"ఓం మణిపద్మేహం మణిపద్మేహం" అంటూ చదువుతున్న లామాలు అవి అవకుండానే కంగారుగా వచ్చి మహానందుని లేవనెత్తబోయారు. కాని అతని మనస్సు క్షేమాదేవి చెంతకు వెళ్ళిపోయింది. ఆ రెండు హృదయాలు గౌతమ బుద్ధునిలో లీనమయిపోయాయి.